సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 16 । జూలై । 2024



వెనక్కి తీసుకోవాలి

మియాపూర్ పరిధిలోని ముజఫర్ అహ్మద్ నగర్‌లో ప్రజలకిచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని నాయకులు కోరారు. 8లో▸



స్వయం ఉపాధి కల్పించండి

నిరుద్యోగ గిరిజన యువతకు స్వయం ఉపాధి కల్పనకు రుణాలివ్వాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు కోరారు. 8లో▸



చేప పిల్లలకు 114 కోట్లు

చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం రూ.114 కోట్లు కేటాయించినందుకు మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా.. తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో 120 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూ సర్వేనంబర్ 277లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మండలవాసులు కలెక్టర్ శశాంకకు విన్నవించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 277లో 1.03 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని.. ఇది సురభి వెంచర్‌కు ఆనుకుని ఉండటంతో కబ్జాకు గురవుతోందని పేర్కొన్నారు. 2021లో ఈ భూమిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని.. ఆ స్థలాన్ని ఇప్పుడు పార్కు పేరుతో కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బి.శ్రీనివాస్, విక్రంరెడ్డి, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, పద్మారావు తదితరులు ఉన్నారు.

‘మధ్యాహ్న భోజనాన్ని’ అక్షయపాత్రకు ఇవ్వొద్దు

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి, అధ్యక్షుడు రామస్వామి.. మాట్లాడుతూ జిల్లాలోని మహేశ్వరం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కొత్తూరు, నందిగామ, శంషాబాద్ మండలాలను అక్షయపాత్రకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారన్నారు. ఇదే జరిగితే 23 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు ఇవ్వకున్నా, సరైన వేతనాలు ఇవ్వకున్నా పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పర్వతాలు, చందుయాదవ్, మధ్యాహ్న భోజనం కార్మికులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు నాగోలు ఎస్టీపీ ఆరంభానికి సిద్ధం

ట్రయల్ రన్ ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెలాఖరులోగా నాగోల్ ఎస్టీపీని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ–2 లో నిర్మిస్తున్న నాగోల్ ఎస్టీపీని సోమవారం ఆయన సందర్శించారు. వెట్ వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలో పర్యటించి సీసీ రోడ్లు, లైటింగ్ పనుల్ని పరిశీలించారు. అంతర్గత రహదారుల నిర్మాణం సహా..ముగింపు దశలో ఉన్న పనుల్ని త్వరితగతిన పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్టీపీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ అశోక్ రెడ్డి మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్–2 సుదర్శన్, సీజీఎం, జీఎం, ఎస్టీపీ ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లాలో రైతులు **3.34** లక్షల మంది
సాగులో ఉన్న పంటలు **5.54** వేల ఎకరాలు
రుణం తీసుకున్న అన్నదాతలు **2.50** లక్షల మంది
తీసుకున్న రుణం మొత్తం రూ.**4,909** కోట్లు

ఇదేమి మెలిక!

రేషన్‌కార్డు ఉన్నవారికే పంట రుణ మాఫీ

- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- రేషన్ కార్డులు లేని రైతుల్లో ఆందోళన
- షరతులు లేకుండా వర్తింపచేయాలని విజ్ఞప్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పంట రుణ మాఫీపై ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులకే మాఫీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇప్పటికే వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందిన జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పోలింగ్ ముగిసిన తరుణంలో సోమవారం ప్రభుత్వం రుణమాఫీకి సబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత కలిగిన రైతుల జాబితాను సిద్ధం చేయాల్సిందిగా ఆయా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రకటనలకు విరుద్ధంగా ..

జిల్లా వ్యాప్తంగా 3.34 లక్షల మంది రైతులు ఉన్నారు. 5.54 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో 2.50 లక్షల మంది రూ.4,909 కోట్లు పంట రుణాలు తీసుకున్నట్లు అధికారుల అంచనా. వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల్లో 40 శాతం మందికి రేషన్‌కార్డులు లేవు. ఉన్న వారిలోనూ ఇంట్లో ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మెజార్టీ రైతులు తమ భూములను ఒకే వ్యక్తి పేరున కాకుండా కుటుంబ సభ్యులందరి పేరున రిజిస్ట్రేషన్లు చేశారు. తమ పేరున భూములున్న రైతులంతా పట్టాదారు పాసుపుస్తకాలను బ్యాంకుల్లో కుదువ పెట్టి రుణాలు పొందారు. వీరిలో రైతులతో పాటు వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకటనలకు విరుద్ధంగా తాజాగా మార్గదర్శకాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో 5,58,410 రేషన్ కార్డులు ఉండగా, 18,22,532 మంది లబ్ధిదారులు రేషన్‌షాపుల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. వీరిలో భూములు లేని వారే ఎక్కువ.

రైతులకు శాపం



పంట రుణాల మాఫీ కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రైతులకు శాపంగా మారాయి. అధికారమే లక్ష్యంగా అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ పేరుతో రైతులను మరోసారి మోసం చేస్తోంది. గత ప్రభుత్వం పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులను జారీ చేయకుండా జాప్యం చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతోంది. రుణమాఫీకి రేషన్ కార్డుని తప్పనిసరిగా చేయడం దుర్మార్గం. రేషన్ కార్డు ప్రామాణికం కాదని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి తాజాగా మోసపూరిత మార్గదర్శకాలు జారీ చేశారు. రైతులను ఇబ్బంది పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ మార్గదర్శకాలను వెంటనే సవరించి, ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలి. లేదంటే బాధిత రైతులతో కలిసి ఆందోళనకు దిగుతాం.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆందోళనలో ఆ రైతులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకులు 370 శాఖలు ఉండగా, గ్రామీణ బ్యాంకులు 57, ప్రైవేటు బ్యాంకులు 202 వరకు (మొత్తం 629) ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ప్రభుత్వ, గ్రామీణ బ్యాంకులు రైతులకు పంట రుణాలు మంజూరు చేశాయి. ఏప్రిల్ 2014 నుంచి 11 డిసెంబర్ 2018 మధ్య కాలంలో వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల కుటుంబాలకు గత ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష చొప్పున వడ్డీతో కలిపి నాలుగు విడతల్లో మాఫీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,43,278 మంది రైతులు రుణాలు తీసుకోగా వీరిలో ఇప్పటి వరకు 74,701 మంది రైతులకు రూ.420 కోట్ల రుణాలను మాఫీ చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 మధ్య కాలం పంట రుణాలు పొందిన రైతుల అప్పులను మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న రైతుల రుణాలను మాత్రమే రద్దు చేయనున్నట్లు స్పష్టం చేయడంతో కార్డు లేనివారు అయోమయంలో పడిపోయారు.

ప్రయాణిస్తున్న కారులో మంటలు

- పూర్తిగా దగ్ధమైన వాహనం



రహదారిపై దగ్ధమవుతున్న కారు

మీర్‌పేట: ప్రయాణిస్తున్న కారులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం నక్కగుట్టతండాకు చెందిన వెంకటేశ్‌నాయక్ సోమవారం సాయంత్రం 6.30 గంటలకు తన మహీంద్రా కారు (టీఎస్09ఇపీ1955)లో మందమల్లమ్మ నుంచి బాలాపూర్ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. ఎస్‌వైఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోగానే కారు ఏసీలో నుంచి పొగలు రావడాన్ని గమనించి రోడ్డు పక్కకు నిలిపాడు. అప్పటికే మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన వెంకటేశ్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో స్థానికులు వచ్చి నీటి ట్యాంకర్ సాయంతో ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. ఫైరింజన్ వచ్చేసరికి కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రూ.5వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్: హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిని రూ.5వేల కోట్ల గ్రీన్ ఫీల్డ్ హైవేగా నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి వెళ్లిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుకు షాద్‌నగర్‌లోని బైపాస్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ఈ రహదారిని రూ.5వేల కోట్ల గ్రీన్ ఫీల్డ్ హైవేగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ విషయమై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు తెలిపారు. మొదటగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వరకు ఉన్న రహదారిని విస్తరించనున్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, రవాణా వ్యవస్థ మరింత బాగుపడుతుందన్నారు. షాద్‌నగర్ పట్టణంలో చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి గతంలో రూ.90కోట్లు మాత్రమే కేటాయించగా ప్రస్తుతం రూ.180 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 15 రోజుల్లో ప్రారంభం అవుతాయన్నారు. 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొండుపల్లిలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నాలుగేళ్లుగా దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో పలుమార్లు విజ్ఞప్తులు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. కరువు భత్యం అందజేయాలని, ఈహెచ్‌ఎస్ పథకం సక్రమంగా అమలు చేయాలని, వెల్‌నెస్ సెంటర్లలో సరైన వసతులు కల్పించాలని, సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందజేయాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మయ్య, జనరల్ సెక్రెటరీ శుభాకర్‌రావు, కేవీ రమణాచారి, పూర్ణచందర్‌రావు, సుధాకర్, కృష్ణాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు సభ్యుల్లో బీసీ రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి పెంచాలన్నారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కులగణన మొదలు పెట్టాలన్నారు. రాహుల్‌గాంధీ దేశంలో పర్యటిస్తున్న సందర్భంలో కూడా ఇదే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీల జెండా ఎత్తుకొని మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కృష్ణ, నందగోపాల్, రామకృష్ణ, వంశీకృష్ణ, సతీష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పోలీస్!

తొలిసారి డ్రోన్ సాంకేతికతపై శిక్షణ

- నేరాల నియంత్రణకు ఇది బ్రహ్మాస్త్రమే ..
- ట్రాఫిక్, క్రైమ్ సీన్, రెస్క్యూ ఆపరేషన్లలో క్రియాశీలక పాత్ర



ఒంటిపై ఖాకీ చొక్కా. చేతిలో లాఠీ లేని పోలీసులే డ్రోన్లు. వ్యవసాయం, వైద్య రంగాల్లో తరహాలోనే పోలీసింగ్‌లో కూడా డ్రోన్లు చేరాయి. పోలీసు శిక్షణ సమయంలోనే రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ సాంకేతికత, వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు. డీజీసీఏ అనుమతులు ఉన్న భారత్ డ్రోన్ అకాడమీ సహకారంతో అంబర్‌పేట, మేడ్చల్ పోలీస్ శిక్షణ కేంద్రంలోని 1,316 మంది శిక్షణ కానిస్టేబుళ్లకు డ్రోన్ వినియోగంపై ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు. డ్రోన్ ఆపరేటింగ్, సన్నివేశాల చిత్రీకరణ, ఆనవాళ్ల సేకరణ, నిబంధనలు వంటి అంశాలపై సుశిక్షితులను చేస్తున్నారు.

– అంబర్‌పేట

సమాజంలో పోలీస్ విధులు సవాలే. రోజురోజుకూ భిన్న నేరాలు జరగడం వాటిని పరిశోధించి పరిష్కారించడం పోలీస్‌లకు విధుల్లో భాగం. అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను వినియోగించి జటిలమైన కేసులను పరిష్కరిస్తున్నారు. నేరం ఏదైనా క్షణాల్లో ఆనవాళ్లు తెలుసుకోవడానికి డ్రోన్ వ్యవస్థను వినియోగించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్‌ను వినియోగించడంపై నిబంధనలు బాధ్యత, భద్రత, అనుమతులు, నో ఫ్లైయింగ్ జోన్‌లపై స్పష్టత వచ్చేలా ట్రెనింగ్ ఇస్తున్నారు. భవిష్యత్తులో నిర్వహించే విధుల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ సమయంలోనే తర్ఫీదు ఇచ్చి సాంకేతికంగా కానిస్టేబుళ్లు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండేలా చూస్తున్నారు.

డ్రోన్‌లు రంగంలోకి దిగితే..

నేరం జరిగినట్లు సమాచారం అందగానే డ్రోన్‌లు రంగంలోకి దిగితే నేర పరిశోధనలో విప్లవాత్మకమైన మార్పే. ఒక ప్రాంతంలో నేరం జరిగితే ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ని జోడించి డ్రోన్‌కు గూగుల్ లొకేషన్‌లో ఆ ప్రాంతానికి క్షణాల్లో పంపిస్తారు. అక్కడ జరిగిన సన్నివేశాల ఆనవాళ్లు కనుమరుగు కాకముందే సకాలంలో డ్రోన్ చేరుకొని వాటిని చిత్రీకరించి సాంకేతిక ఆధారాలు సేకరించి భద్రపరుస్తుంది. అలాగే.. డ్రోన్లతో ట్రాఫిక్ సమస్యను సైతం సకాలంలో పరిష్కరించేందుకు దోహద పడుతుంది. ట్రాఫిక్‌జామ్‌కు గల కారణాలను గుర్తించి పోలీసులకు చేరవేయడంతో సులువుగా ఎలా పరిష్కరించాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. భారీ బహిరంగా సభలు, క్లిష్టమైన బందోబస్తు, ప్రకృతి విపత్తులను అంచనాలు వేసి పరిష్కారానికి మార్గం సుగమం చేసే అవకాశం ఉంటుంది.

డ్రోన్ శిక్షణ గర్వంగా ఉంది

నేర సవాళ్లను ఎదుర్కోవడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం క్రియాశీల పాత్ర పోషిస్తోంది. పోలీస్ శిక్షణలో మొదటిసారి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడం గర్వంగా ఉంది. డ్రోన్‌పై ట్రైనీలకు మెలకువలు నేర్పించి భవిష్యత్తులో విధుల్లో ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా చొరవ తీసుకుంటున్నాం.

– పి.మధుకర్ స్వామి, పీటీసీ ప్రిన్సిపాల్

పరిహారం చెల్లించకుండా భూములు తీసుకోవద్దు

- తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

సాక్షి,రంగారెడ్డిజిల్లా: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నిర్మిస్తున్న బీదర్–మహేశ్వరం 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం ఆ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌తో కలిసి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల, షాబాద్, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూరు మండలాల మీదుగా (తెలంగాణలో 165 కిలోమీటర్ల దూరం లైన్) 765 కేవీ విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నారని, ఒక్కో టవర్‌కు 12గుంటలు, లైన్ల కింద మరో 12 గుంటల చొప్పున మొత్తం 3వేల ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఆయాలైన్ల కింద ఇళ్లు, గోదాములు, ఇతర నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. అంతే కాదు కరెంట్ లైన్ల కారణంగా పక్కనే ఉన్న రైతు భూమితో పోలిస్తే..లైన్లు వేసిన రైతుల భూముల ధరలు కూడా భారీగా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పరిహారం చెల్లించకుండా రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

నోటీసులు వెనక్కి తీసుకోవాలి


అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: శేరిలింగంపల్లి మండలం మియాపూర్ పరిధిలోని ముజఫర్ అహ్మద్ నగర్‌లో ప్రజలకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మియాపూర్ సర్వే నంబరు 100లో 35 ఏళ్లుగా నివసిస్తున్న వారికి హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు, నల్లా బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, పల్లె మురళి, అంగడి పుష్ప, తుకారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీకి రూ.114 కోట్లు

మత్స్యకార్మిక సంఘం హర్షం


మాట్లాడుతున్న నర్సింహ

ఇబ్రహీంపట్నం: చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.114 కోట్లను కేటాయించినందుకు మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నర్సింహ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నంలోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారులకు కేటాయించిన బడ్జెట్‌తో నాణ్యమైన మూడు అంగుళాల చేప పిల్లలను అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని కోరారు. తమ సంఘం చేస్తున్న పోరాటాల ఫలితంగా ప్రభుత్వం నిధులను కేటాయించిందని, మత్స్య సొసైటీల అకౌంట్లల్లో ఈ నగదును జమ చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో గొడవపడి.. వ్యక్తి బలవన్మరణం

షాబాద్: తల్లిదండ్రులతో గొడవపడిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్తగూడలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఫిరంగి శ్రీశైలం(35) ఈ నెల 14న రాత్రి మద్యం సేవించి వచ్చి తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఉదయం పొలానికి వెళ్తున్నానని చెప్పిన ఆయన అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లే వరకు చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. తల్లిదండ్రులతో గొడవపడి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో తైబజార్ వేలం

రూ.15.50లక్షలకు సొంతం చేసుకున్న మహిళ


శోభాపెంటరాజ్ దంపతులను సన్మానిస్తున్న విజయలక్ష్మి, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో తైబజార్‌కు వేలం నిర్వహించగా రూ.15.50లక్షల రికార్డు ధరకు ఓ మహిళ సొంతం చేసుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 2024–25 సంవత్సరంలో ఎనిమిది నెలల కాలానికి చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో నలుగురు పోటీ పడగా శోభాపెంటరాజ్ రూ.15.50లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది 12నెలల కాలానికి రూ.పదిలక్షలే పలికిన తైబజార్ ఈ ఏడాది ఏకంగా రూ.5.50లక్షలు ఎక్కుగా పోవడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తైబజార్‌ను దక్కించుకు శోభాపెంటరాజ్ దంపతులను చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, సిబ్బంది అంజన్‌కుమార్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలకు సైతం..

చికెన్ వ్యర్థాల మూడేళ్ల(2024–2027) తరలింపునకు గాను సోమవారం వేలం నిర్వహించారు. ఇద్దరు పోటీపడగా గౌస్ అనే వ్యక్తి రూ.3.90లక్షలకు వేలం సొంతం చేసుకున్నారు.

స్వయం ఉపాధి కల్పించండి


గిరిజన నాయకులతో సమావేశమైన ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్

ఆమనగల్లు: నిరుద్యోగ గిరిజన యువతకు స్వయం ఉపాధి కల్పనకు రుణాలు ఇవ్వాలని ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు మేడిగడ్డ రవీందర్ నాయక్ కోరారు. సోమవారం వారు నగరంలోని ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయంలో తేజావత్ బెల్లయ్యనాయక్‌ను కలిశారు. ఇటీవలే ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించినందున ఘనంగా సన్మానించారు. అనంతరం తండాల్లో సమస్యలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చైర్మన్‌తో చర్చించారు. తండాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి నిమిత్తం విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. గిరిజన రైతుల వ్యవసాయానికి సాయం అందిచాన్నారు. సొంతిళ్లు లేని గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించి ఆదుకోవాలన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, దశరథ్ నాయక్, రాములునాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కార్యవర్గ నియామకం

శంషాబాద్: శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్. సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొనమొల్ల దేవేందర్, ఉపాధ్యక్షులుగా జి.బి. సంజీవరావు, కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారి మేకల సిద్దులు, సలహాదారులుగా సతీష్‌రెడ్డి, ఎం.రత్నం, ఆర్.మల్లేష్, కృష్ణారెడ్డి, బుగ్గయ్య, యాదగిరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్


షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దామోదర్

చేవెళ్ల: వైద్యసిబ్బంది సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్ హెచ్చరించారు. సోమవారం ఆయన షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక గ్రామంలో ఒక ఇంట్లో ఫీవర్ వచ్చిందని గుర్తిస్తే ఆ ఇంటికి నలుమూలల వంద ఇండ్లు సర్వే చేయాలని, సర్వే చేసిన దాంట్లో పది శాతం కేసులు పాజిటివ్ వస్తే ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ ఆర్ఎంపీ డాక్టర్లు సొంత వైద్యం చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్ఎంపీ డాక్టర్లు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని.. మిగిలిన వైద్యం ఆశ వర్కర్, ఏఎన్ఎం, సూపర్ వైజర్, ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం అందించాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీహెచ్ఓ గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ శంకర్ తదితరులున్నారు.

యువ పారిశ్రామికవేత్తలను తయారు చేశాం


మెషిన్ల పనితీరును అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి కేటీఆర్

మాజీ మంత్రి కేటీఆర్

మణికొండ: చదువుకుని ఉద్యోగం చేయటమే జీవిత లక్ష్యంగా కాకుండా తామే పది మందికి ఉపాధి కల్పించాలనుకునే యువకులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, అదే తరహాల్లో ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం కోకాపేటలో మురళీ నాయక్, రాకేష్‌నాయక్ అనే యువకులు సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ స్కీమ్ కింద ఏర్పాటు చేసిన 'డ్రాపిట్ మోడ్రన్ లాండ్రీ అండ్ క్లీనింగ్ హబ్'ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చదువులు చదవగానే చిన్న పనులు చేసేందుకు కొందరు నామోషీగా భావిస్తారని, అలాంటిది వీరు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఎంబీఏ చదువుకుని అప్పటి ప్రభుత్వ సహకారంతో ఓ వ్యాపారాన్ని ప్రారంభించటం అభినందనీయమన్నారు. ఢిల్లీ, ఇటలీ నుంచి తెచ్చిన ఆధునిక యంత్రాలతో లాండ్రీని ఏర్పాటు చేసి పది మందికి ఉపాధిని చూపుతున్నారన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేసేందుకు గతంలో ఐఎస్‌బీ ద్వారా శిక్షణ ఇప్పించటంతో పాటు సబ్సిడీలు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సహించారన్నారు. రాబోయే రోజుల్లో నగరంలో మరో ఐదు యూనిట్లను ప్రారంభించి వంద మందికి ఉపాధి కల్పిస్తామని యువ వ్యాపారవేత్తలు మురళీనాయక్, రాకేష్‌నాయక్‌లు తెలిపారు.

పోలీసులను బెదిరించిన హోంగార్డ్‌పై కేసు

ఘట్‌కేసర్: పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించిన ఓ హోంగార్డ్‌పై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాలు... ఘట్‌కేసర్ వారసంతలో ఈ నెల 12న హయత్‌నగర్‌కు చెందిన ధనుంజయ మెడలోంచి బంగారు, వెండి గొలుసును లాక్కెళ్లిన ఘటనలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అజ్మీరా వెంకటేశ్ నిందితుడు. అతడి తండ్రి అజ్మీరా కిషన్(51) సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డ్. ధనుంజయ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంకటేశ్‌ను ఈ నెల 13న అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం రిమాండ్‌కు తరలిస్తుండగా కిషన్ వచ్చి 'నేను హోంగార్డును, మా కుమారుడినే రిమాండ్‌కు తరలిస్తారా..'అంటూ పోలీసులను అసభ్యపదజాలంతో దూషించాడు. సిబ్బందిని తోసుకుంటూ లోపలికి వెళ్లి డీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగాడు. 'నా కుమారుడిని రిమాండ్‌కు తరలిస్తే మీ అంతు చూస్తా, మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి సస్పెండ్ చేయిస్తా'అని హెచ్చరించాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరించిన హోంగార్డుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బావను కొట్టి చంపిన బావమరిది

జవహర్‌నగర్: సోదరిని వేధింపులకు గురిచేస్తున్నాడనే కోపంతో బావను బావమరిది కర్రతో కొట్టి చంపిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో కారుడ్రైవర్ కానుగంటి రాజుగౌడ్(32), భార్య భవాని, కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజు భార్యతో గొడవపడి చేయి చేసుకున్నాడు. అడ్డుకోబోయిన అత్తపై కూడా దాడికి పాల్పడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన బావమరిది చందు బావపై కర్రతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన రాజును స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిఫిన్స్ అమ్మడానికి వెళ్తూ..

గచ్చిబౌలి: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఫ్లై ఓవర్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ జీహెచ్ వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు... రాయదుర్గంలో నివాసం ఉండే సోము సాంబశివరావు(38) ప్రతిరోజు లూనాపై వెళ్లి కైత్లాపూర్‌లో టిఫిన్ విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై నుంచి మాదాపూర్ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో సాంబశివరావు ఫ్లై ఓవర్ పై నుంచి ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లూనాపై ఉన్న టిఫిన్స్ చెల్లాచెదురయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

లిఫ్ట్ ప్రమాదంలో సైట్ ఇంజినీర్ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలోని లిఫ్ట్ కేబుల్ తెగి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట గోపాల్‌రావునగర్ కాలనీలోని మంజీరా రోడ్డులో ఆదిత్య పార్ట్యూన్ హైట్స్ పేరుతో హైరైజ్ బిల్డింగ్ నిర్మిస్తున్నారు. అదే కంపెనీలో గచ్చిబౌలి అంజయ్యనగర్‌కు చెందిన ఉప్పల లక్ష్మీనారాయణ(56) సైట్ ఇంజనీర్. బిహార్‌కు చెందిన సద్దాం, అర్బాజ్ సలాంతో కలిసి ఆదిత్య పార్ట్యూన్ హైట్ భవన నిర్మాణంలో లిఫ్ట్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం లిఫ్ట్ 12వ అంతస్తు నుంచి 9వ అంతస్తుకు రాగానే కేబుల్ తెగి కిందపడటంతో అందులో ఉన్న లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సద్దాం, సలాంలకు తీవ్ర గాయాలయ్యాయి. కంపెనీలో పనిచేసే సిబ్బందికి ఎలాంటి రక్షణ చర్యలు(హెల్మెట్లు, ఇతర పరికరాలు) లేవని, కంపెనీ నిర్లక్ష్యం వల్లే లక్ష్మీనారాయణ మృతి చెందాడని ఆయన కుమారుడు ఉదయ్ సత్యసాయి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫోన్ చోరీ.. ఖాతా ఖాళీ!

నానాటికీ తెలివిమీరుతున్న దొంగలు

- యూపీఐ యాప్ రీ-యాక్టివేట్ చేసి బాధితుడి బ్యాంకు ఖాతా కల్లాస్
- జూబ్లీహిల్స్, మొయినాబాద్‌ల్లో రెండు ఉదంతాలు వెలుగులోకి..
- వినియోగదారుల అవగాహనా రాహిత్యమే నేరగాళ్లకు వరం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన సెల్‌ఫోన్ చోరులు నానాటికీ తెలివి మీరుతున్నారు. ఇదివరకు తస్కరించిన స్మార్ట్ ఫోన్లను మారు వ్యాపారులకు ఎంతోకొంతకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఇప్పుడు తస్కరించిన ఫోన్ సహాయంతో సంబంధిత యజమానికి చెందిన బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తున్నారు. ఈ యజమానుల అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యమే వీరికి కలిసి వస్తోందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా ఉదంతాలు జూబ్లీహిల్స్, మొయినాబాద్‌ల్లో వెలుగులోకి రాగా, బయటకు రానివి అనేకం ఉంటాయని పేర్కొంటున్నారు. తస్కరించిన ఫోన్ ద్వారా ఎక్కువ లాభం పొందడం, పోలీసులకు చిక్కకుండా ఉండటమే దొంగల ప్రధాన ఉద్దేశం. ఈ చోరులు తస్కరించిన ఫోన్లను నగరంలోని వివిధ మార్కెట్లలో ఉన్న సెకండ్ హ్యాండ్ వ్యాపారులకు విక్రయించేవారు. సదరు స్మార్ట్ ఫోన్ ఎంత కొత్తది అయినా దాని అసలు ధరలో గరిష్టంగా 25 నుంచి 30 శాతం మాత్రమే వ్యాపారులు చెల్లిస్తారు. మరోపక్క ఇటీవల కాలంలో నగరంలో జరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ టీమ్స్‌తోపాటు స్థానిక పోలీసులు అనేకమంది దొంగలు, వ్యాపారులను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో తస్కరించిన ఫోన్‌ను విక్రయించకుండా ధ్వంసం చేస్తున్నారు.

రొటీన్ నంబర్లతో లాక్ చేసినవే టార్గెట్

సాధారణంగా స్మార్ట్ ఫోన్లను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌లతోపాటు పిన్ వినియోగించి లాక్, అన్‌లాక్ చేసుకోవచ్చు. అయితే ప్రతి ఫోన్‌కూ ఓ లాక్ పిన్ ఉండటం సాధారణం. స్మార్ట్ ఫోన్‌ను ఫేషియల్, బయోమెట్రిక్, ప్యాట్రన్‌ల్లో అన్‌లాక్ చేయడంలో ఇబ్బందులు వచ్చినా, అన్‌లాక్ కోసం నిర్ణీత దఫాల కంటే ఎక్కువ సార్లు ఈ మూడు ఆప్షన్స్‌ను తప్పుగా వినియోగించినా అప్పుడు పిన్ ఎంటర్ చేసి అన్‌లాక్ చేస్తుంటారు. అత్యధికులు ఇప్పటికీ '0000', '1234', '1111', '9999'వంటి రొటీన్ సంఖ్యలనే పిన్ నెంబర్లుగా పెట్టుకుంటున్నారు. ఓ ఫోన్ చోరీ చేసిన తర్వాత దొంగలు ఈ పిన్స్‌తో అన్‌లాక్‌కు ప్రయత్నిస్తున్నారు. అన్‌లాక్ సఫలీకృతమైతే బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయడంపై దొంగలు దృష్టి పెడుతున్నారు.

యూపీఐ యాప్ రీ-ఇన్‌స్టాల్ చేస్తూ...

నగదు అవసరమైనవాళ్లు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు డ్రా చేసుకోవడానికి గతంలో నేరుగా బ్యాంకుకు వెళ్లేవారు. ఆపై ఏటీఎం మిషన్లు, నెట్ బ్యాంకింగ్స్ వచ్చాయి. అయితే ఇప్పుడు యూపీఐ యాప్స్ వినియోగంలోకి వచ్చాయి. కోవిడ్ పీరియడ్ తర్వాత దాదాపు ప్రతి ఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లోనూ యూపీఐ యాప్స్ ఉంటున్నాయి. అయితే ఫోన్ అన్‌లాక్ చేయడానికి వాడిన పిన్స్‌ను వినియోగించి దొంగలు యూపీఐ యాప్స్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా యాప్ ఓపెన్ కాకపోతే, దానిని అన్ ఇన్‌స్టాల్ చేసి, మళ్లీ ఇన్‌స్టాల్ చేసి యాక్టివేట్ చేస్తున్నారు. ఈ యాక్టివేషన్ కోసం బ్యాంకు ఖాతాతో లింకై ఉన్న సెల్‌ఫోన్ నెంబర్ తమ దగ్గర ఉండటం ఈ దొంగలకు కలిసి వస్తోంది. ఇలా యూపీఐ యాప్‌లు, ఒక్కోసారి నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫోన్ యజమానికి సంబంధించిన బ్యాంకు ఖాతాను చోరులు ఖాళీ చేసేస్తున్నారు. ఫోన్ వినియోగదారుడు మేల్కొని అవసరమైన చర్యలు తీసుకునే లోపే తీవ్ర నష్టం జరిగిపోతోంది.

రికార్డుల్లో ఎక్కిన రెండు ఉదంతాల్లో ఇలా...

- నగరానికి చెందిన ఓ వ్యక్తి మెట్రో రైలులో మూసాపేట నుంచి జూబ్లీహిల్స్‌కు ప్రయాణిస్తుండగా అతడి సెల్‌ఫోన్ తస్కరణకు గురైంది. దీనిపై ఆయన జూబ్లీహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ ఫోన్ చేజిక్కించుకున్న దొంగలు దాని నెట్ బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లను యాక్సస్ చేశారు. వీటి ఆధారంగా బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.5.2 లక్షలు కాజేశారు. ఈ అంశంలో కొసమెరుపు ఏంటంటే.. బాధితుడి క్రెడిట్ లిమిట్‌ను పెంచి మరీ స్వాహా చేయడం.
- వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ లారీ డ్రైవర్ ఇటీవల తన వాహనంలో సిమెంట్ లోడ్ తీసుకుని నగరం నుంచి తాండూరు వెళ్తున్నారు. అజీజ్‌నగర్ వద్ద లారీ ఆపి విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో ఆయన జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు చోరులు తస్కరించారు. ఇందులోని యూపీఐ యాప్‌లు వాడి ఓల్డ్ బోయిన్‌పల్లి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో 20 లావాదేవీల ద్వారా రూ.75 వేలు స్వాహా చేశారు. పలువురిని కలిసి ఈ దొంగలు ఆస్పత్రి ఖర్చుల పేరుతో నగదు అత్యవసరం అని చెప్పారు. బాధితుడి బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు యూపీఐ ద్వారా వారికి పంపి, వారి నుంచి డబ్బు తీసుకున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే...

- రొటీన్ అంకెలను పిన్ నెంబర్లుగా పెట్టుకోకూడదు. ఫోన్, యూపీఐ యాప్స్‌ను అన్‌లాక్ చేయడానికి ఒకే పిన్ వినియోగించకూడదు.
- ఫోన్ పోగొట్టుకున్నా, తస్కరణకు గురైనా వెంటనే అప్రమత్తమై సిమ్‌కార్డుతోపాటు బ్యాంకు ఖాతాను కూడా బ్లాక్, ఫ్రీజ్ చేయించాలి.
- కేవలం సిమ్‌కార్డును బ్లాక్ చేయించి ఊరుకుంటే ఫలితం లేదు. చోరుల వైఫై ద్వారా ఫోన్‌లో ఉన్న యూపీఐ యాప్స్ వాడి నగదు స్వాహా చేసే అవకాశం ఉంది.
- ఈ కేటుగాళ్లు కొన్నిసార్లు స్క్రీన్ గార్డులు అధ్యయనం చేయడం ద్వారా ప్యాట్రన్స్, పిన్ నెంబర్లను గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన, ఎలాంటి గుర్తులు పడని స్క్రీన్ గార్డులు వాడాలి.
- అవకాశం ఉన్న వాళ్లు ఓటీపీలు పొందేందుకు ప్రత్యేకంగా ఓ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ సిమ్‌ను స్మార్ట్‌ఫోన్‌లో కాకుండా చిన్న బేసిక్ ఫోన్ ద్వారా వినియోగించాలి.